
చిన్నారిని పరామర్శిస్తున్న ఎమ్మెల్యే కృష్ణారావు, కార్పొరేటర్ రవీందర్‌రెడ్డి

కుక్కకాటు బాధితులను పరామర్శించిన ఎమ్మెల్యే

బాలానగర్, ఆగస్టు 2(ఆంధ్రజ్యోతి): బాలానగర్ డివిజన్‌లో గురువారం సాయంత్రం పిచ్చికుక్క కాటుకు గురైన చిన్నారులను ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు, స్థానిక కార్పొరేటర్ ఆవుల రవీందర్‌రెడ్డితో కలిసి శుక్రవారం పరామర్శించారు. అసెంబ్లీ సమావేశాల అనంతరం నేరుగా బాలానగర్ చేరుకున్న ఎమ్మెల్యే కుక్కకాటుకు గురైన బాధితుల ఇళ్లకు వెళ్లి వారి ఆరోగ్య పరిస్థితిపై ఆరా తీశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కృష్ణారావు మాట్లాడుతూ.. హైదరాబాద్ మహానగరంలో వీధికుక్కల సంఖ్య విపరీతంగా పెరిగినా వీటి నియంత్రణకు అధికారులు ఎలాంటి చర్యలు చేపట్టడం లేదని అసహనం వ్యక్తం చేశారు. గురువారం బాలానగర్‌లో 24 మంది (చిన్నారులు, వృద్ధుల)ను కుక్క కరిచిందని ఆయన వాపోయారు.

విద్యార్థులకు పుస్తకాలు, బ్యాగ్‌ల పంపిణీ

హైదర్‌నగర్: కూకట్‌పల్లి నియోజకవర్గంలోని ప్రభుత్వ పాఠశాలలోని 110 మంది విద్యార్థులకు తనసొంత నిధులతో పుస్తకాలు, పెన్నులు, బ్యాగ్‌లను ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు శుక్రవారం అందజేశారు. కార్పొరేటర్ జూపల్లి సత్యనారాయణ, సంతోష్, ప్రభాకర్, చైతన్య, సంతోష్‌యాదవ్, హెచ్‌ఎం, పాల్గొన్నారు.

నసీరుద్దీన్‌షా ఉర్సు ప్రారంభం

ఓల్డుబోయినపల్లి: హిందూ, ముస్లింలు స్నేహంగా ఉర్సు జరుపుకోవడం శుభ సూచకమని ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు అన్నారు. శుక్రవారం నుంచి ఓల్డుబోయినపల్లి డివిజన్ నసీరుద్దీన్‌షా దర్గా వద్ద ఏర్పాటు చేసిన రెండు రోజుల ఉర్సు ఉత్సవాల్లో కార్పొరేటర్ ముద్దం నర్సింహయాదవ్ పాల్గొన్నాడు.


కూకట్‌పల్లి జోనల్ కమిషనర్‌కు వినతిపత్రం ఇస్తున్న మహిళా నేతలు

మహిళా సమాఖ్య సభ్యులకు వేతనం ఇవ్వాలి

ఫతేనగర్, ఆగస్టు 2(ఆంధ్రజ్యోతి): 25 ఏళ్లుగా మహిళా సమాఖ్య లీడర్లుగా సేవలందిస్తున్న వారికి గౌరవ వేతనం అందజేయాలని సమాఖ్య లీడర్లు, సీఐటీయూ జిల్లా సహాయక కార్యదర్శి ఐలాపురం రాజశేఖర్ ప్రభుత్వాన్ని డిమాండ్ శుక్రవారం చేశారు. మహిళా సమాఖ్య లీడర్లంతా కూకట్‌పల్లి జోనల్ కమిషనర్ అపూర్వచౌహాన్, గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ అర్బన్ కమ్యూనిటీ ప్రాజెక్ట్ డైరెక్టర్ సౌజన్యను కలిసి వినతిపత్రం అందజేశారు. దశాబ్దాల కాలం నుంచి మహిళా సమాఖ్య లీడర్లుగా సేవలందిస్తున్న వారికి జీహెచ్‌ఎంసీ గౌరవ వేతనం ఇవ్వాలని వారు విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో సంతోషి, అనంతలక్ష్మి, మధులత, చంద్రకళ, శోభారాణి, సునందాదేవి, రోజా, స్వరూప, అనిత, శ్రీదేవి పాల్గొన్నారు.

సీసీ రోడ్డు, డ్రైనేజీ పనుల పరిశీలన

హైదర్‌నగర్, ఆగస్టు 2 (ఆంధ్రజ్యోతి): హైదర్‌నగర్‌లో చేపడుతున్న సీసీ రోడ్డు, డ్రైనేజీ పనులను కార్పొరేటర్ నార్నె శ్రీనివాస్ శుక్రవారం పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. హైదర్‌నగర్ డివిజన్‌లో మౌలిక సదుపాయాలకు పెద్దపీట వేస్తున్నామన్నారు. సీసీ రోడ్డు, డ్రైనేజీ వంటి అభివృద్ధి పనులను నాణ్యత ప్రమాణాలతో పూర్తి చేయాలని కాంట్రాక్టర్లకు సూచించారు. కార్యక్రమంలో అధికారులు డీఈ రమేష్, ఏఈ రాజీవ్, వర్క్‌ఇన్‌స్పెక్టర్ మహదేవ్, కాలనీవాసులు తదితరులు పాల్గొన్నారు.


సీసీరోడ్డు పనులను పరిశీలిస్తున్న శ్రీనివాసరావు

స్వచ్ఛమైన గాలి కోసం మొక్కలను నాటాలి

జీడిమెట్ల, ఆగస్టు 2(ఆంధ్రజ్యోతి): స్వచ్ఛమైన గాలి కోసం మొక్కలను నాటాలని కూకట్‌పల్లి డివిజన్ ఆర్‌ఎంఎన్ ఆర్ కవిత శుక్రవారం అన్నారు. జీడిమెట్ల డిపో ఆవరణలో ఏర్పాటు చేసిన వృక్షమహోత్సవానికి ఆమె ముఖ్య అతిథిగా హాజరై మొక్కలను నాటారు. డిపో మేనేజర్ ఆంజనేయులు, అసిస్టెంట్ మేనేజర్ నీలవేణి, అసిస్టెంట్ ఇంజనీర్ సందీప్‌కుమార్, డ్రైవర్లు, కండక్టర్లు పాల్గొన్నారు.

● పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత: జగదీశ్వర్‌గౌడ్

మియాపూర్, ఆగస్టు 2 (ఆంధ్రజ్యోతి): న్యూహఫీజ్‌పేట, సుభాష్‌చంద్రబోస్ నగర్ వెల్ఫేర్ అండ్ డెవలప్‌మెంట్ కమిటీ అసోసియేషన్ అధ్యక్షుడు ఆరేపల్లి సాంబశివగౌడ్ ఆధ్వర్యంలో ప్రతి ఇంటికి మొక్క నాటుదాం.. పర్యావరణం కాపాడుదాం కార్యక్రమం శుక్రవారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి శేరిలింగంపల్లి నియోజకవర్గ ఇన్‌చార్జి జగదీశ్వర్‌గౌడ్ స్థానికులతో కలిసి మొక్కలు నాటారు. పర్యావరణ పరిరక్షణ మనందరి బాధ్యతని, మొక్కలు నాటి సంరక్షించాలని సూచించారు. న్యూమాస్టర్‌మైండ్ స్కూల్ ప్రిన్సిపల్ షేక్ అయూబ్, కమిటీ అడ్వైజర్ ఎండి సాజిద్‌అలీ, సత్యనారాయణ, రమేష్, ఉపాధ్యక్షుడు సయ్యద్, ఇస్మాయిల్, ఎండి సాబీర్, రాములుయాదవ్, ముక్తార్ తదితరులు పాల్గొన్నారు.


మొక్కలకు నీళ్లు పోస్తున్న కవిత

కుత్బుల్లాపూర్ డీటీగా మల్లికార్జునరావు

గాజులరామారం, ఆగస్టు 2 (ఆంధ్రజ్యోతి): కుత్బుల్లాపూర్ మండల డిప్యూటీ తహసీల్దార్ (డీటీ)గా మల్లికార్జునరావు శుక్రవారం బాధ్యతలు చేపట్టారు. ఇక్కడ పని చేసిన డీటీ అశ్వనీ కుమార్ కీసరకు బదిలీపై వెళ్లారు. అనంతరం మల్లికార్జునరావు మాట్లాడుతూ.. మండల కార్యాలయానికి వచ్చే వారు నేరుగా అధికారులనే సంప్రదించి, వారి పనులను చేయించుకోవాలన్నారు. మండలానికి వచ్చే వారు మధ్యవర్తులను నమ్మి మోసపోవద్దన్నారు.


మొక్కలకు నీళ్లు పోస్తున్న కవిత


కార్పొరేటర్ ఉప్పలపాటి శ్రీకాంత్‌కు వినతిపత్రం ఇస్తున్న కాలనీసభ్యులు

సమస్యలపై కార్పొరేటర్‌కు వినతి

మియాపూర్, ఆగస్టు 2 (ఆంధ్రజ్యోతి): మియాపూర్ డివిజన్ పరిధిలోని పలు కాలనీల అసోసియేషన్ సభ్యులు స్థానంగా ఉన్న సమస్యలు, అభివృద్ధి పనులపై కార్పొరేటర్ ఉప్పలపాటి శ్రీకాంత్‌ను కలిసి వినతపత్రం శుక్రవారం అందజేశారు. దీనికి కార్పొరేటర్ సానుకూలంగా స్పందించి మాట్లాడుతూ.. కాలనీలోని సమస్యలు, అభివృద్ధి పనులపై అధికారుల దృష్టికి తీసుకువెళ్లి దశలవారిగా పరిష్కరిస్తామన్నారు. ప్రజలకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా మెరుగైన మౌలిక వసతులు కల్పించడం జరుగుతుందని తెలిపారు. కార్యక్రమంలో కాలనీల అసోసియేషన్ సభ్యులు దేవేందర్‌రావు, దశరథ్, జహంగీర్, ఫ్రాన్సిస్, గోపాల్‌రెడ్డి, సంతోష్‌ముదిరాజ్, కృష్ణ, ఉమాకిషన్, రజనీకాంత్, నరేష్‌నాయక్, శివముదిరాజ్, రమేష్, అనిల్‌రెడ్డి, హరినాథ్‌రెడ్డి, నరేష్‌రెడ్డి, శ్రీకాంత్‌యాదవ్, శివ, రాజేష్ పాల్గొన్నారు.

మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలి

నిఫ్ట్ ఓరియంటేషన్ ముగింపు కార్యక్రమంలో టీఎస్ న్యాబ్ డైరెక్టర్ సందీప్ శాండిల్య

హైదరాబాద్‌సిటీ, ఆగస్టు 2(ఆంధ్రజ్యోతి): మనసుకు ఆనందపరిచే చర్యలతో సంతోషం పొందాలని, మత్తు పదార్థాలతో కాదని తెలంగాణ యాంటీ నార్కోటిక్స్ బ్యూరో (టీఎస్ న్యాబ్) డైరెక్టర్ సందీప్ శాండిల్య విద్యార్థులకు తెలిపారు. మాదాపూర్‌లోని నేషనల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఫ్యాషన్ టెక్నాలజీ (నిఫ్ట్)లో జరుగుతున్న ఓరియంటేషన్ ముగింపు కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా 'సబ్‌స్టాన్సెస్ అబ్యూస్' అనే అంశంపై విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడారు. సహజసిద్ధంగా ఆనందం పొందడానికి ప్రయత్నించాలని విద్యార్థులకు సూచించారు. చేసే పనులు చిన్నవే కావొచ్చు కానీ.. మనసుకు ఆనందం కలిగించే చర్యలు, విజయాల ద్వారా సంతోషం పొందడానికి ప్రయత్నించాలని విద్యార్థులకు ఉద్బోధించారు. మత్తు పదార్థాలపై వ్యామోహం వద్దని, డ్రగ్స్, ఇతర మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని కోరారు. కృత్రిమమైన సంతోషాన్ని అందించే మత్తు పదార్థాల కంటే సహజసిద్ధంగా పొందే ఆనందమే అన్నింటికంటే ఎక్కువని, మత్తు పదార్థాల పట్ల అప్రమత్తంగా ఉండాలన్నారు. మత్తు పదార్థాలకు దూరంగా ఉండటమే కాదు, వాటి గురించి సమాచారం తెలిస్తే తక్షణమే అధికారుల దృష్టికి తీసుకువెళ్లాలని వివరించారు. తల్లిదండ్రుల ఆకాంక్షలను తీర్చాల్సిన బాధ్యత మాత్రమే కాదు, తమ లక్ష్యాలను చేరుకోవాల్సిన అవసరం విద్యార్థుల మీదనే ఉందన్న ఆయన మత్తు పదార్థాల జోలికి వెళ్లకుండా తమ లక్ష్య సాకారానికి కృషి చేయాలన్నారు. అనంతరం డ్రగ్స్‌కు దూరంగా ఉంటామని విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో క్యాంపస్ డైరెక్టర్ ప్రొఫెసర్ డాక్టర్ మాలిని దివాకర్, జాయింట్ డైరెక్టర్ అవినాష్ రాయ్‌పల్లి విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న సందీప్‌శాండిల్య

బిజినెస్‌లోన్ పేరుతో బురిడీ

- నగరవాసి నుంచి రూ.1.50 కోట్లు కాజేసిన ముఠా
- ఇద్దరి అరెస్ట్. పరారీలో 11 మంది

హైదరాబాద్ సిటీ, ఆగస్టు 2 (ఆంధ్రజ్యోతి): వ్యాపారాభివృద్ధి కోసం లోన్ ఇస్తామంటూ నగరవాసి నుంచి రూ.1.50 కోట్లు కాజేసిన ముఠాలోని ఇద్దరు సభ్యులను మాదాపూర్ పోలీసులు శుక్రవారం అరెస్ట్ చేశారు. లక్నో ప్రాంతానికి చెందిన మహ్మద్ సద్దాం అన్సారీ అలియాస్ మహ్మద్ జైన్ అన్సారీ(33) కేఫ్ నిర్వహించేవాడు. నష్టాలు రావడంతో మోసాలు చేయాలని పథకం వేశాడు. షాజీఅహ్మద్ సిద్దికీ, దుర్గేష్ శుక్లా, ప్రతిభా అగ్నిహోత్రి, నవనీత్‌వర్మ, కిరణ్‌కుమార్‌శర్మ, జయంత్ చటర్జీ, అరవింద్, జాగులి మగ్రేకర్, అమ్నాఅన్సారీ, ప్రియాంక దీక్షిత్‌లతో కలిసి ముంబైలో కార్యాలయం ప్రారంభించాడు. వ్యాపారాభివృద్ధి కోసం వ్యాపారవేత్తలు కమీషన్‌లు చెల్లించడం చూసిన అతడు బిజినెస్ లోన్‌ల పేరుతో అందినకాడికి దండుకుంటున్నాడు. నగరానికి చెందిన శ్రీకాంత్ చౌదరి తన సోలార్ మాడ్యూల్ వ్యాపారం విస్తరించేందుకు రుణం కోసం ఎదురుచూస్తున్నాడు. ఇతడికి సపన్ సియా అనే మహిళ ద్వారా నిందితుడు అన్సారీతో పరిచయం అయింది. వ్యాపారాన్ని పెంచుకునేందుకు రూ.150 కోట్ల రుణం కావాలని శ్రీకాంత్ చౌదరి ముఠాను సంప్రదించాడు. లోన్ ప్రాసెసింగ్ పూర్తయిందని, ముందుగా రూ.1.50 కోట్లు డిపాజిట్ చేయాలని సూచించారు. వారు చెప్పిన విధంగా రూ. 1.50 కోట్లు వారి ఖాతాలకు పంపాడు. లోన్ రాకపోవడంతో మోసపోయానని గ్రహించి పోలీసులకు ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసుకున్న పోలీసులు ప్రధాన నిందితుడు సద్దాం అన్సారీతో పాటు షాజీ అహ్మద్ సిద్దికీలను అరెస్ట్ చేశారు. ముఠాలోని మిగతా 11 మంది సభ్యులు పరారీలో ఉన్నట్లు పోలీసులు తెలిపారు.


ఫలహారబండి ఊరేగింపులో కార్పొరేటర్ వెంకటేష్‌గౌడ్

ఘనంగా ఫలహారబండి ఊరేగింపు

హైదర్‌నగర్, ఆగస్టు 2 (ఆంధ్రజ్యోతి): ఆల్విన్‌కాలనీ డివిజన్ పరిధిలోని ఎల్లమ్మబండ పీజేఆర్ నగర్‌లో గడ్డం శ్రీనివాస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన తొట్టెల, ఫలహార బండి ఊరేగింపులో కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్‌గౌడ్ ముఖ్యఅతిథిగా హాజరై పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు, స్థానికులు పాల్గొన్నారు.

వైభవంగా ఏవియేటర్స్ మీట్

హైదరాబాద్ సిటీ, ఆగస్టు 2 (ఆంధ్రజ్యోతి): విమానయానరంగంలో విశేష సేవలందించిన ఏవియేటర్లతో ఏర్పడిన హైదరాబాద్ ఏవియేటర్స్ సొసైటీ ఆధ్వర్యంలో ఏవియేటర్స్ సమావేశం గురువారం రాత్రి మాదాపూర్‌లోని ఓ సంస్థ షో రూమ్‌లో జరిగింది. దాదాపు 250 మంది ఏవియేటర్స్ పాల్గొన్న ఈ కార్యక్రమంలో 50 ఏళ్ల క్రితం విమానయాన రంగంలో సేవలందించిన వ్యక్తులు కూడా పాల్గొనడం విశేషం. ఏవియేషన్ రంగంలో నూతనంగా కెరీర్ ప్రారంభించిన వారికి తమ అనుభవాలను చెప్పిన వారు, ఈ రంగంలో ఏ విధంగా ఉండాలో తగు సూచనలు కూడా చేశారు. ఈ సందర్భంగా హైదరాబాద్ ఏవియేటర్స్ అసోసియేషన్ వ్యవస్థాపకులు కెప్టెన్ అనిల్ కుమార్ మాట్లాడుతూ ఏవియేషన్ రంగంలో విశేష కృషి చేసిన వారందరికీ ఒక వేదికను ఏర్పాటు చేయాలనే లక్ష్యంతో ఏర్పాటు చేసిన ఈ అసోసియేషన్‌లో 600 మందికి పైగా సభ్యులు ఉన్నారన్నారు. 18 ఏళ్ల క్రితం తొలిసారిగా ఏవియేటర్స్ మీట్ ఏర్పాటు చేశామని, ఇప్పుడు 250 మందికి పైగా పాల్గొన్నారని తెలిపారు. కార్యక్రమంలో ఏవియేషన్ హిస్టారియన్ అనురాధరెడ్డి, అసోసియేషన్ సహ వ్యవస్థాపకులు కెప్టెన్ మార్క్ నీల్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా నిర్వహించిన లైవ్ మ్యూజిక్, మ్యాజిక్ షో వంటివి ఆకట్టుకున్నాయి.


ఏవియేటర్స్ మీట్‌లో కెప్టెన్ అనిల్‌కుమార్, తదితరులు


మృతుడి కుటుంబసభ్యులను పరామర్శిస్తున్న ఎమ్మెల్యే సునీతారెడ్డి

ప్రైవేటు ఆస్పత్రి ఎదుట మృతుడి బంధువుల ఆందోళన

రాయదుర్గం, ఆగస్టు 2 (ఆంధ్రజ్యోతి): వైద్యుల నిర్లక్ష్యం కారణంగానే తమ బంధువు మృతి చెందాడని మృతుడి బంధువులు గచ్చిబౌలిలోని ఓ ప్రైవేటు ఆసుపత్రి ఎదుట శుక్రవారం మధ్యాహ్నం ఆందోళన చేశారు. దీంతో ఆ ప్రాంతంలో ఉద్రిక్త వాతావరణం నెలకొంది. మెదక్ జిల్లా నర్సాపూర్‌కు చెందిన వెంకటేష్(45) అనారోగ్యంతో 10 రోజుల క్రితం ఆసుపత్రిలో చికిత్స పొందుతూ శుక్రవారం ఉదయం 9.30 గంటల సమయంలో కార్డియాక్ అరెస్ట్ కారణంగా వెంకటేశ్ మరణించాడు. వైద్యుల నిర్లక్ష్యంతోనే వెంకటేశ్ మృతి చెందాడని బంధువులు ఆరోపించారు. ఆసుపత్రి ఎదుట ఆందోళనకు దిగారు. విషయం తెలుసుకున్న నర్సాపూర్ ఎమ్మెల్యే సునీతారెడ్డి ఆసుపత్రికి చేరుకొని మృతుడి బంధువులను పరామర్శించారు. అనంతరం ఆసుపత్రి యాజమాన్యంతో మాట్లాడి మృతుడి బంధువుల అనుమానాలను నివృత్తి చేశారు. దీంతో వివాదం సర్దుమణిగింది.

ఎస్సీ వర్గీకరణ తీర్పు ప్రజాస్వామ్య గెలుపు

మియాపూర్,ఆగస్టు2(ఆంధ్రజ్యోతి): సుప్రీంకోర్టు ఇచ్చిన ఎస్సీ వర్గీకరణ తీర్పు ప్రజాస్వామ్య గెలుపని శేరిలింగంపల్లి నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి జగదీశ్వర్‌గౌడ్ అన్నారు. ఎస్సీ వర్గీకరణపై సుప్రీంకోర్టు తీర్పును స్వాగతిస్తూ శేరిలింగంపల్లి ఎస్సీ సెల్ ఆధ్వర్యంలో నిర్వహించిన సంబరాల్లో ఆయన ముఖ్య అతిథిగా హాజరై అంబేద్కర్, సీఎం రేవంత్‌రెడ్డి చిత్రపటాలకు క్షీరాభిషేకం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఇచ్చిన మాటకు కట్టుబడి సీఎం రేవంత్‌రెడ్డి రాష్ట్రంలో వర్గీకరణ చేపడతామని చెప్పడం సంతోషకరమన్నారు.

● ఎంసీపీఐ(యు) హర్షం

మియాపూర్: ఎస్సీ వర్గీకరణ తీరుపై హర్షం వ్యక్తం చేస్తు శుక్రవారం ఎంసీపీఐ(యు)నాయకులు నడిగడ్డతండాలో ఉన్న అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. నాయకులు స్వీట్లు పంచుకున్నారు. దశరథ్, రంగస్వామి, లక్ష్మి, నరసింహ, లలిత, శివాని, జయలక్ష్మి, అరుణ, పాల్గొన్నారు.

దేవేందర్‌నగర్‌లో జేఈ వ్యాక్సినేషన్

గాజులరామారం, ఆగస్టు 2(ఆంధ్రజ్యోతి): గాజులరామారం డివిజన్ దేవేందర్‌నగర్‌లో పట్టణ ఆరోగ్య సిబ్బంది స్కూల్ విద్యార్థులకు జేఈ (మెదడు వ్యాపు నివారణ) వ్యాక్సిన్ శుక్రవారం వేశారు. ఇప్పటికే దేవేందర్‌నగర్‌లోని పలుబస్తీలోని చిన్నారులకు, ప్రభుత్వ స్కూల్ విద్యార్థులకు వ్యాక్సినేషన్ పూర్తి అయిందని ఎంపీహెచ్‌ఎడబ్ల్యూ ఇందిర తెలిపారు. ఈ కార్యక్రమంలో సిబ్బంది లావణ్య రాధిక సుధారాణి, తాసిన్ పాల్గొన్నారు.


● చెత్త తొలగింపు

బహదూర్‌పల్లిలో ఓ చెరువు వద్ద పేరుకుపోయిన చెత్తాచెదారంతో వర్షంనీరు చేరి దుర్వాసన వస్తోంది. ఆ ఏరియా నుంచి సీఎం వెళ్తున్నారని తెలియడంతో జీహెచ్‌ఎంసీ సిబ్బంది ఫ్లైఓవర్‌పై చెత్తా చెదారాన్ని శుక్రవారం తొలగించారు.

హెచ్‌సీయూలో సందడి చేసిన ప్రపంచ యాత్రికుడు

● 195 దేశాల్లో పర్యటించిన తొలితెలుగు వ్యక్తిగా రవిప్రభు రికార్డు

హైదరాబాద్ సిటీ, ఆగస్టు 2 (ఆంధ్రజ్యోతి): ప్రపంచంలోని అత్యధిక దేశాల్లో పర్యటించిన తెలుగు వ్యక్తిగా పేరున్న రవిప్రభు శుక్రవారం హైదరాబాద్ కేంద్రీయ విద్యాలయంలో కాసేపు సందడి చేశారు. వర్సిటీలో రాజనీతిశాస్త్ర విభాగం (1994-96 బ్యాచ్) పూర్వ విద్యార్థి అయిన రవిప్రభ కాసేపు యూనివర్సిటీ విద్యార్థులతో సంభాషించారు. విశాఖపట్నంకు చెందిన ఆయన భూటాన్‌లో ప్రపంచ పర్యటనను ప్రారంభించారు. తాజాగా వెనిజులా(195వ దేశం)లో పర్యటించారు. ప్రపంచంలోని 195కు పైగా దేశాల్లో పర్యటించిన సర్టిఫికేట్ పొందిన 280 మంది యాత్రికుల బృందంలో ప్రవేశించిన మొదటి తెలుగు వ్యక్తి రవిప్రభు కావడం విశేషం. వివిధ దేశాల ప్రజల సంస్కృతుల గురించి, ఆయా దేశాల్లో తన ప్రయాణ అనుభవాలను, వివిధ మార్గాల్లో ఎదుర్కొన్న భాష, వంటకాలు వంటి అంశాలను విద్యార్థులతో పంచుకున్నారు. రవిప్రభుతో విద్యార్థులు ఉత్సాహంగా ఉల్లాసంగా మాట్లాడారు. ఈ ఇంటరాక్టివ్ సెషన్‌లో విద్యార్థులతో పాటు పొలిటికల్ సైన్స్ విభాగాధిపతి ప్రొఫెసర్ కైలాష్, వర్సిటీ సిబ్బంది షాజీ, ఆశిష్ జాకబ్ థామస్ తదితరులు పాల్గొన్నారు.


విద్యార్థులతో సంభాషిస్తున్న రవిప్రభు

దోమల నివారణపై అవగాహన

అల్లాపూర్, ఆగస్టు 2 (ఆంధ్రజ్యోతి): దోమల నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై మూసాపేట్ సీవో మురళీ ఆధ్వర్యంలో శుక్రవారం మూసాపేట్ డివిజన్ పరిధిలోని ముస్కిపేట్, మూసాపేట్‌లో ఇంటింటికీ తిరిగి అవగాహన కార్యక్రమం చేపట్టారు. నిల్వఉన్న నీళ్లలో దోమలు వృద్ధి చెందుతాయని, వారానికొకసారి కచ్చితంగా ట్యాంకులు, పూలకుండీలు, తొట్టిలు, కూలర్లు ఇతరత్రా నీరు నిల్వ ఉండే పరికరాలను ఖాళీ చేయాలని సూచించారు. దోమల ద్వారా చికున్‌గన్యా, మలేరియా వంటి వ్యాధులతో పాటు మెదడువాపు, డెంగీ వంటి ప్రాణాంతక వ్యాధుల బారిన పడకుండా దోమల నిర్మూలనే సరైన మార్గమని సిబ్బంది సూచించారు. కార్యక్రమంలో ఆర్.పి.లు గాయత్రి, చందన, శానిటేషన్ సిబ్బంది పాల్గొన్నారు.


డబ్బాల్లోంచి నీటిని పారబోస్తున్న సిబ్బంది

ఖాళీ డబ్బాల్లో నీరు నిల్వ ఉంచొద్దు

పేట్‌బషీరాబాద్: పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని కొంపల్లి పురపాలక సంఘం కమిషనర్ శ్రీహరి అన్నారు. పురపాలక సంఘం పరిధిలోని వార్డుల్లో డ్రై డే కార్యక్రమాన్ని శుక్రవారం నిర్వహించారు. రోజు వాడుకునే నీటి డబ్బాలను వారానికి ఒక్కసారి శుభ్రం చేసుకోవాలని మహిళలకు సూచనలు చేశారు.

మన ప్రాంతాలను శుభ్రంగా ఉంచుకోవాలి

పేట్‌బషీరాబాద్: మన చుట్టూ ఉన్న ప్రాంతాలను ఎప్పటికప్పుడు శుభ్రంగా ఉంచుకున్నప్పుడే వ్యాధులు దరిచేరవని ఎంటమాలజీ సూపర్‌వైజర్ అబ్దుల్ రజాక్ తెలిపారు. రంగారెడ్డినగర్ డివిజన్‌లోని ఓ స్కూల్‌లో దోమల నివారణపై విద్యార్థులకు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. దోమల ఉత్పత్తి, వాటి జీవితకాలం, దోమలతో వచ్చే వ్యాధుల గురించి వివరించారు.

శాకంబరీ అలంకరణలో శ్రీదుర్గా అమ్మవారు

హైదరాబాద్ సిటీ, ఆగస్టు 2 (ఆంధ్రజ్యోతి): సుచిత్రలోని శ్రీదుర్గా ఎస్టేట్‌లోని దుర్గా దేవాలయంలో శుక్రవారం అమ్మ వారిని శాకంబరీ అలంకరణ చేసి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ప్రతి ఆషాఢమాసంలో చివరి శుక్రవారం శాకాంబరీగా అలకంరణ చేయడం ఆనవాయితీ అని ఆలయ పూజారి గోపీచార్యులు వివరించారు. ఈ సందర్భంగా దేవాలయం, అమ్మవారిని ప్రత్యేకంగా ఐదు క్వింటాళ్ల కూరగాయలతో అలంకరించినట్లు తెలిపారు. భక్తులు అధిక సంఖ్యలో విచ్చేసి అమ్మవారిని దర్శించుకుని పూజలు చేసినట్లు చెప్పారు.


అమ్మవారి శాకంబరీ అలంకరణ

ఎంఎన్‌ఆర్‌యూ తొలి వీసీగా జేఎన్‌టీయూ మాజీ డైరెక్టర్ బాధ్యతల స్వీకరణ

హైదరాబాద్ సిటీ, ఆగస్టు 2(ఆంధ్రజ్యోతి): తెలంగాణ ప్రభుత్వం అనుమతితో కొత్తగా ఏర్పాటైన ఎంఎన్‌ఆర్ విశ్వవిద్యాలయం తొలి ఉపకులపతిగా జేఎన్‌టీయూ మాజీ డైరెక్టర్ డాక్టర్ ఎం.అంజిరెడ్డి నియమితులయ్యారు. ఈ మేరకు ఎంఎన్‌ఆర్ యూనివర్సిటీ చాన్స్‌లర్ ఎంఎస్‌రాజు శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు. చాన్స్‌లర్ ఉత్తర్వుల మేరకు వైస్ చాన్స్‌లర్‌గా డాక్టర్ అంజిరెడ్డి బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా నూతన వీసీ అంజిరెడ్డికి వర్సిటీ అడ్మిషన్స్ విభాగం డైరెక్టర్ నాగేశ్, రిజిస్ట్రార్ సత్యనారాయణ, ప్రొ-వైస్‌చాన్స్‌లర్ వర్మ తదితరులు అభినందనలు తెలిపారు. డాక్టర్ అంజిరెడ్డి ఇంతకు మునుపు హైదరాబాద్ జేఎన్‌టీయూలో మూడున్నర దశాబ్దాల పాటు సీనియర్ ప్రొఫెసర్‌గా, ఆర్ అండ్ డీ, అడ్మిషన్స్, ఫారెన్ రిలేషన్స్ విభాగాల డైరెక్టర్‌గా సేవలందించారు. మాజీ డైరెక్టర్‌కు ఎంఎన్‌ఆర్ యూనివర్సిటీ తొలి వైస్ చాన్స్‌లర్‌గా అవకాశం లభించడం పట్ల జేఎన్‌టీయూలో పనిచేస్తున్న ఆచార్యులు, ఉన్నతాధికారులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.


డాక్టర్ అంజిరెడ్డి

ఫ్లై ఓవర్‌ను ఢీకొన్న కారు.. బీటెక్ విద్యార్థి మృతి

రాయదుర్గం, అగస్టు2(ఆంధ్రజ్యోతి): రాయదుర్గంలోని శుక్రవారం తెల్లవారుజామున ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. ఈ ప్రమాదంలో ఓ యువకుడు అక్కడికక్కడే మృతి చెందాడు. రాయదుర్గం ఇన్‌స్పెక్టర్ వెంకన్న తెలిపిన వివరాల ప్రకారం.. యూసుఫ్‌గూడ రహ్మత్‌నగర్‌కు చెందిన జి.చరణ్(19) తల్లి చనిపోవడం, తండ్రి వేరుగా ఉండటంతో తన తాత వద్ద ఉంటూ బీటెక్ రెండో సంవత్సరం చదువుతున్నాడు. కాగా శుక్రవారం తెల్లవారుజామున 2.30 గంటల సమయంలో తన స్నేహితుడిపి కలిసి వస్తానని ఇంట్లో చెప్పి కారులో బయలుదేరాడు. నందీహిల్స్ నుంచి మల్కం చెరువు వైపు వెళ్తున్న కారు వేగంగా వచ్చి మల్కంచెరువు వద్ద ఫ్లైఓవర్ గోడను బలంగా ఢీ కొట్టాడు. ఈ ప్రమాదంలో కారు నుజ్జునుజ్జు అయింది. చైతన్య అక్కడికక్కడే మృతి చెందాడు. సమాచారం అందుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకొని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఉస్మానియా ఆస్పత్రికి తరలించారు. ఈ మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.


చరణ్ (ఫైల్)

ఇంటిగ్రేటెడ్ పీజీ అడ్మిషన్లకు దరఖాస్తుల ఆహ్వానం

ఈ నెల 22 నుంచి కౌన్సెలింగ్, సెప్టెంబర్ 2 నుంచి తరగతులు

హైదరాబాద్ సిటీ, ఆగస్టు 2 (ఆంధ్రజ్యోతి): యూనివర్సిటీ ఆఫ్ హైదరాబాద్ (హెచ్‌సీయూ)లో ఇంటిగ్రేటెడ్ పీజీ కోర్సుల్లో 2024-25కు సంబంధించిన అడ్మిషన్ల ప్రక్రియ ప్రారంభమైంది. కామన్ యూనివర్సిటీస్ ఎంట్రెన్స్ టెస్ట్(సీయూఈటీ) 2024లో స్కోరు సాధించిన అభ్యర్థులు తాము ఎంచుకున్న కోర్సులో అడ్మిషన్ కోసం ఈనెల 15లోగా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేయాల్సి ఉంటుంది. మొత్తం 442 సీట్ల భర్తీ నిమిత్తం ఈనెల 22నుంచి కౌన్సెలింగ్ ప్రక్రియను నిర్వహిస్తామని, సెప్టెంబర్ 2నుంచి తరగతులు ప్రారంభమవుతాయని అధికారులు తెలిపారు. మరిన్ని వివరాలకు యూనివర్సిటీ వెబ్‌సైట్‌ను సందర్శించవచ్చని పేర్కొన్నారు.

ఆటో దొంగను చెట్టుకు కట్టేసిన స్థానికులు

గాజులరామారం, ఆగస్టు 2(ఆంధ్రజ్యోతి): ఆటోను ఎత్తుకెళ్తున్న దొంగను స్థానికులు పట్టుకొని చెట్టుకు కట్టేసి జీడిమెట్ల పోలీసులకు సమాచారం అందించారు. జీడిమెట్ల పారిశ్రామికవాడ సబ్-స్టేషన్ సమీపంలో నిలిపి ఉన్న ఆటోను ఓ వ్యక్తి దొంగిలించాడు. గాజులరామారం డివిజన్‌లోని హెచ్‌ఏఎల్ కాలనీలో ఆటోని గుర్తించిన స్థానికులు పట్టుకొన్నారు. ఆటో ఓనర్‌ను సంఘటనా స్థలానికి చేరుకొని పోలీసులకు సమాచారం ఇచ్చారు.